# శ్రీ ఆలపాటి ధర్మారావు

శ్రీ ఆలపాటి ధర్మారావు తొమ్మిదవ శాసనసభ (1989-1994) డెప్యూటీ స్పీకర్‌గా 1990, మార్చి 20న ఏకగ్రీవంగా ఎన్నికై 1992, సెప్టెంబరు 28 వరకు ఆ పదవిని నిర్వహించారు.

వీరు గుంటూరు జిల్లా కొల్లిపర మండలం అన్నవరపు లంక గ్రామములో శ్రీ వెంకయ్య, శ్రీమతి శేషమ్మ దంపతులకు 1933, మే 15న జన్మించారు. బి.ఎ., బి.ఎల్., డిగ్రీలను ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి పొందారు. వీరు తెనాలిలో న్యాయవాది వృత్తిని చేపట్టి ప్రముఖ న్యాయవాదిగా పేరు గడించారు.

వీరు తెనాలి పురపాలక సంఘానికి మూడుసార్లు అధ్యక్షునిగా ఎన్నికైనారు. వీరు 1970-1978 సంవత్సరములలో తెనాలి పట్టణ సహకార బ్యాంకు అధ్యక్ష పదవిని నిర్వహించారు. వీరు 1978-1980 సంవత్సరములలో తెనాలి న్యాయవాదుల సంఘానికి అధ్యక్షునిగా ఉన్నారు. వీరు ఆ సమయంలో తెనాలి కోర్టు భవన నిర్మాణానికి కృషి చేసారు. వీరు 1980-1982 సంవత్సరములలో తెనాలి పి.ఎన్.ఆర్. మరియు ఎన్.వి. ఆర్. కళాశాలకు కార్యదర్శిగా పని చేసినారు. వీరు 1981-1984 సంవత్సరములలో జంపని సహకార చక్కెర కర్మాగారానికి అధ్యక్షునిగా ఉన్నారు.

శ్రీ ధర్మారావు 1985వ సంవత్సరములో జరిగిన ఎన్నికలలో గుంటూరు జిల్లా దుగ్గిరాల నియోజవర్గం నుండి రాష్ట్ర శాసనసభకు మొదటిసారి ఎన్నికైనారు. శ్రీ ధర్మారావు అనుగత చట్ట నిర్మాణ కమిటి, ప్రభుత్వ లెక్కల కమిటి, వివిధ బిల్లులపై సెలెక్ట్ కమిటీల సభ్యునిగా ఉన్నారు. వీరు శాసన సభలో అనేక విషయాలపై జరిగే చర్చలలో చురుకుగా పాల్గొనేవారు.

వీరు 1989వ సంవత్సరములో జరిగిన ఎన్నికలలో గుంటూరు జిల్లా వేమూరు నియోజకవర్గం నుండి శాసనసభకు రెండవసారి ఎన్నికైనారు. వీరు డెప్యూటీ స్పీకరుగా శాసనసభ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించినారు. డెప్యూటీ స్పీకర్ హోదాలో అర్జీల కమిటీకి 1990-1991, 1991-1992 సంవత్సరాలలో అధ్యక్షులుగా ఉన్నారు.

శ్రీ ధర్మారావు శ్రీ విజయభాస్కర రెడ్డి మంత్రివర్గంలో 1992, అక్టోబరు 10 నుండి 1993, సెప్టెంబరు 8 వరకు న్యాయం, కోర్టులు, రవాణా శాఖల మంత్రిగా, 1993, సెప్టెంబరు 10 నుండి 1994, డిసెంబరు 12 వరకు హోం, జైళ్ళు, అగ్నిమాపక శాఖల మంత్రిగా ఉన్నారు.

మంచి పరిపాలనాధక్షుడిగా పేరుగాంచిన శ్రీ ధర్మారావు 2003, మే 7న మరణించారు.

## శ్రీ ఆలపాటి  ధర్మారావు డెప్యూటీ స్పీకరుగా ఎన్నికైన సందర్భంగా చేసిన ప్రసంగం

అధ్యక్షా, ఈ ఉపసభాపతి పదవికి నన్ను ఎంపిక చేసినందుకు సభాపతిగా మీకు, ముఖ్యమంత్రి   డా. చెన్నారెడ్డి గారికి  కృతజ్ఞతలు తెలుపుతున్నాను. వారి ఎంపికను ఆమోదించి, హర్షించి, మద్దతు ఇచ్చినందుకు కాంగ్రెస్ పార్టీ సభ్యులను అభినందిస్తున్నాను. వారు చేసిన ఎంపికను బలపరచి, ఈనాడు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంలో తోడ్పడిన ప్రతిపక్ష సభ్యులకు, ప్రతిపక్ష నాయకులకు హృదయపూర్వకంగా ధన్యవాదములు తెలుపుతున్నాను. పెద్దలు డా. చెన్నారెడ్డి గారి నుంచి క్రొత్తగా ఎన్నికయిన సభ్యుల వరకూ, అధికారపక్ష సభ్యులు, ప్రతిపక్ష సభ్యులు కూడా నా గురించి చాలా మంచి మాటలు చెప్పారు. వారికి నా పట్ల గల అభిమానానికి సుహృద్భావానికి నిదర్శనంగా భావిస్తున్నాను. ఆ మాటలు అనిపించుకోవడానికి నాకు అర్హత ఉందో లేదో కానీ మొత్తం మీద వారు చేసిన సూచనల మేరకు వ్యవహరించడానికి, వారి నమ్మకాన్ని నిలబెట్టడానికి నేను శక్తివంచన లేకుండా తప్పకుండా ప్రయత్నిస్తానని మనవి చేస్తున్నాను. గత 5 సంవత్సరాల శాసనసభా కాలంలో ఏమయినా మా బాధ్యతను మేము నిర్వహించగలిగామంటే, అనుభవం పొందగలిగామంటే ఆ ఘనత అప్పటి ప్రతి పక్షనాయకులు బాగారెడ్డి గారికే దక్కుతుంది. చాలా అపారమైన అనుభవం, మంచి పరిజ్ఞానం కలిగిన వారి 'ఏబుల్ గైడెన్స్'  లో ఎంతో నేర్చుకున్నాము. అందుకు నేను సంతోషిస్తున్నాను. నా వైపు నుంచి నిష్పక్షపాతంగా వ్యవహరించడానికి ప్రయత్నిస్తాను. అన్ని పార్టీల వారు సహకరించి, ఈ హుందాతనాన్ని, గౌరవాన్ని కాపాడడంలో తోడ్పడతారని ఆశిస్తున్నాను. స్పీకరు గారికి నా  శాయశక్తులా సహకారాన్ని  అందించడానికి తోడ్పడతానని పరస్పరం  ఒకరినొకరు సహకరించుకుంటూ, ఈ సభా కార్యక్రమాన్ని హుందాగా, రాష్ట్ర  ప్రజలకు ఎంతగానో ఉపయోగపడేట్లు కొనసాగించడంలో విజయం సాధించగలమని ఆశిస్తూ, కృతజ్ఞతలతో సెలవు తీసుకుంటున్నాను.